క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన

నింద్ర: బాలింతలు, కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ శ్యామల కోరారు. బుధవారం మండలంలోని ఆరూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం, పరిసరాల శుభ్రత, ఆహార శుభ్రత, చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి

శ్రీరంగరాజపురం: కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నివారణ కోసం రోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి ప్రాణాంతకం కాదన్నారు. వ్యాధి సోకిన వారు చికిత్స చేయకుండా వదిలేస్తే నరాలు దెబ్బతినడం, వైకల్యం, పక్షవాతం, అంధత్వం వస్తుందన్నారు. అనంతరం రిటైర్డ్ డీపీఓ యువరాజు, శంకరమ్మ దంపతులు రోగులకు ఉచితంగా దుప్పట్లు, మందులు, చీరలను పంపిణీ చేశారు. మండల వైద్యాధికారులు డాక్టర్ గిరి, బాలసుబ్రమణ్యంరెడ్డి, గౌరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ద్రవ జీవామృతం తొట్టెలు ఏర్పాటు



ఎం.కొత్తూరులో ద్రవజీవామృతం తొట్టెలు ఏర్పాటు చేసుకుంటున్న రైతు

నగరి : రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. బుధవారం ఎం.కొత్తూరులో రైతులు తమ పొలాల్లో ద్రవ జీవామృతం తొట్టెలు ఏర్పాటు చేసుకున్నారు. పంటలకు నీరుపారే కాలువల పక్కనే వీటిని ఏర్పాటు చేయడంతో వీటిలో నుంచి వచ్చే జీవామృతం నీటిలో కలిసి పంటలకు చేరి, పోషకాలు అంది ఏపుగా పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ చంద్ర తెలిపారు.

శరవేగంగా ఎన్‌సీడీ-సీడీ సర్వే

విజయపురం: మండలంలో ఎన్‌సీడీ-సీడీ సర్వే వేగవంతంగా చేస్తున్నారు. ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు ఇంటింటా సర్వే చేసి క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అనీమియా రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం ఎలా ఉందో నమోదు చేస్తున్నారు.

ఐషర్ వాహనం బోల్తా



బోల్తా పడిన వాహనం

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న మలుపు వద్ద బుధవారం వరి బస్తాలతో వెళ్తున్న ఐషర్ లారీ బోల్తా పడింది. ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదు. వాహనంలో ఉన్న వరి బస్తాలు నేలపాలైనట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

రైతులకు కార్డు పోటు.. పథకాలకు వేటు..!

ప్రభుత్వం సర్వేలు, వైద్య పరీక్షల పేరిట వివిధ సామాజిక పింఛన్ల కోతకు ఇప్పటికే పూనుకుంది. ఫలితంగా వైద్య పరీక్షల కోసం దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఇప్పుడా స్థితిలోకి రైతులను కూడా కూటమి ప్రభుత్వం నెట్టేస్తోందని తాజాగా తీసుకున్న నిర్ణయం తేటతెల్లం చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, పెట్టుబడి సాయం, రుణాలు పొందడానికి రైతులు విధిగా గుర్తింపు కార్డు (ఫార్మర్ ఐడీ కార్డ్) పొందాలని, ఇందుకోసం ఈ నెలాఖరులోపు గడువు విధించింది. లేని పక్షంలో ఏ పథకాల ఫలాలు అందవని స్పష్టం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- అన్నదాతలకు అవస్థలు
- కూటమి ప్రభుత్వ నిర్వాకం
- 28లోపు రైతు గుర్తింపు కార్డు పొందాలి
- ముందుగా పీఎం కిసాన్ పొందే వారికే అవకాశం
- కార్డు లేకుంటే పథకాల ఫలాలకు మొండిచెయ్యే..!
- ఆందోళన చెందుతున్న రైతులు



నందిమంగళం రైతు సేవా కేంద్రంలో గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమం



వడమాల సేవా కేంద్రంలో..

పుత్తూరు: దేశానికి వెన్నెముక రైతన్న అంటూనే ఆ రైతుల నడ్డి విరిచే కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తాజాగా రైతు గుర్తింపు కార్డు (ఫార్మర్ ఐడీ కార్డ్) అంటూ కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఈనెల 28లోపు విధిగా ఈ కార్డు పొందాలని అధికారులు ప్రకటించడంతో ఉన్నఫలంగా రైతులు రైతు సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అయితే ఈ రైతు గుర్తింపు కార్డు పొందేందుకు ముందుగా పీఎం కిసాన్ పథకం పొందుతున్న రైతులకు మాత్రమే అవకాశం కల్పించడం మరో ట్విస్ట్. ఆ తర్వాత సొంత భూములున్న వారికి కార్డులు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. ఈ కార్డుల కేటాయింపులో కౌలు రైతుల మాట ఎక్కడా ప్రస్తావించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

పుత్తూరు వ్యవసాయ డివిజన్‌లోని రైతుల వివరాలు

మండలం	రైతుల సంఖ్య	పీఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య
పుత్తూరు	8,671	3,158
నారాయణవనం	6,115	3,073
వడమాలపేట	6,421	3,309
రామచంద్రాపురం	6,976	4,267
మొత్తం	28,183	13,807

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ

ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు జోరుగా పొలం పనుల్లో నిమగ్నమై ఉన్నారు. కొన్ని రోజులుగా జిల్లాలోని ప్రతి గ్రామంలో వరి ఒబ్బిళ్లు జోరుగా సాగుతున్నాయి. మరో రెండు మూడు నెలల పాటు రైతులు వ్యవసాయ పనుల్లోనే నిమగ్నమై ఉంటారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రైతు గుర్తింపు కార్డులంటూ, కేవలం రెండు మూడు వారాల గడువు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో మొత్తం 28,183 మంది రైతులు ఉండగా, పీఎం కిసాన్ లబ్ధిదారులు 13,807 మంది ఉన్నారు. ఇంత మందికి కేవలం రెండు మూడు వారాల్లో గుర్తింపు కార్డుల కేటాయింపు సాధ్యమేనా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఆధార్ కార్డులాగా రైతుకు గుర్తింపు కార్డు ఉండాలని, లేకుంటే ప్రభుత్వ సబ్సిడీలు, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ పథకం ఫలాలు అందవని ప్రకటించడంతో రైతులకు ఇది పిడుగుపాటైంది!

గుర్తింపు కార్డుల సమాచారమే తెలియదు!



మారుమూల గ్రామాల్లో ఉన్న రైతులకు గుర్తింపు కార్డుల సమాచారం ఇప్పటి వరకు చేరనే లేదు. ఇంత తక్కువ సమయంలో గుర్తింపు కార్డుల నమోదు, జారీ సాధ్యమయ్యే పనేనా? పుత్తూరు మండలంలో రైతులు వేలల్లో ఉండగా, రైతు సేవా కేంద్రాలు కేవలం 10 మాత్రమే ఉన్నాయి. రైతు సేవా కేంద్రాల్లోనే నమోదుకు వస్తే.. రైతులందరూ క్యూ కట్టాల్సిందే. నెట్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల్లోనూ అవకాశం కల్పిస్తే వెసులుబాటు ఉంటుంది.

– టి.కేశవులు, రైతు, కేబీఆర్ పురం

రైతులందరికీ గుర్తింపు కార్డులు



వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేసే దిశగా భూములున్న రైతులందరికీ గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నదే ప్రభుత్వం ఉద్దేశం. ఈనెల 28వ తేదీ లోపు పీఎం కిసాన్ రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో గుర్తింపు కార్డును పొందాలి. ప్రతి గుర్తింపు కార్డులో 11 అంకెలతో ఒక నంబర్ కేటాయిస్తారు. అదే రైతు ఐడీ నెంబర్‌గా పరిగణిస్తారు. ఈ కార్డు పొందిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయి.

ఆర్.రమేష్‌రాజు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్, పుత్తూరు డివిజన్.

మంచి ప్రవర్తనతో మెలగాలి

– నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్



కార్వేటినగరం సీఐ కార్యాలయం ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

కార్వేటినగరం: హత్యలు, దొంగతనాలు, మాదక ద్రవ్యాల అమ్మకాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తనతో మెలగాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉన్న వారిపై కేసులు మాఫీ చేసే అవకాశం ఉంటుందన్నారు. పలు రకాల కేసుల్లో రౌడీ షీటర్‌గా ఉంటున్నవారు వయసుమీరి, అనారోగ్యంతో బాధపడుతున్న వారు డాక్టర్ సర్టిఫికెట్‌తో పాటు వినతి పత్రాన్ని స్థానిక ఎస్‌ఐలు, సీఐకి అందించాలన్నారు. వారి ఆరోగ్యపరిస్థితిని పరిశీలించి కేసుల నుంచి తొలగించడానికి తమ వంతు ప్రయత్నిస్తామన్నారు. గంజాయి, సారా, మద్యంఅమ్మకాల వివరాలను పోలీసుల దృష్టికి తీసుకొచ్చి సహకరించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచుతారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐలు రాజ్‌కుమార్(కార్వేటినగరం), సుమన్(శ్రీరంగరాజపురం), వెంకటసుబ్బయ్య(వెదురుకుప్పం), పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దుల్లో నిఘా పెంచండి



మాట్లాడుతున్న డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్

కార్వేటినగరం: సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచి ఎప్పటికప్పుడు అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో మీడియాతో డీఎస్పీ మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని శ్రీరంగరరాజపురం, పాలసముద్రం, కార్వేటినగరం మండలాల సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి, సారా, తమిళనాడు మద్యం అమ్మకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్వేటినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల ప్రాంతాల్లో ఆకతాయిలు విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నట్లు సమాచారం ఉందని, అలాంటి ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. అక్రమ ఇసుకపై ప్రత్యేక దృష్టి సారించి డంపులను స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. డీఎస్పీ వెంట సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మామిడి రైతులకు కవర్ల పంపిణీ

వెదురుకుప్పం: మండలంలోని మామిడి రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా కవర్లు పంపిణీ చేస్తున్నట్లు ఆ శాఖ అధికారి సాగరిక బుధవారం తెలిపారు. కావాల్సిన రైతులు ఆయా ప్రాంతాల పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో రైతు వాటాను చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికే ఒక కవరు రూ 1 చొప్పున అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు అన్‌లోడింగ్ చార్జీలు కలిపి చెల్లించాల్సి ఉందన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి

పాలసముద్రం: మండల పరిధిలోని మహిళలు కాయిర్ బోర్డు వారి సౌజన్యంతో సంస్థలో ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్యామల శివప్రకాష్ రాజు, ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రూరల్ యాక్షన్ సంస్థ సభ్యుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో మహిళలకు యూత్ కాయిర్ ప్రొడక్ట్స్ మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ కాయిర్ బోర్డు రీజినల్ ఆఫీసర్ దుర్గాదాస్, బ్యాంకు మేనేజర్ వినోద్‌ఎమార్, డిప్యూటీ తహసీల్దార్ రిషివర్మ, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు వేయిస్తున్న సర్పంచ్ లక్ష్మి

వెదురుకుప్పం: మండలంలోని టీకేఎంపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు స్థానిక సర్పంచ్ లక్ష్మి తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య నెలకొనడంతో పంచాయతీ నిధుల నుంచి కొత్తగా బోరు వేయించినట్లు తెలిపారు. గతంలో ఉన్న బోరులో నీళ్లు సక్రమంగా రాకపోవడంతో వెంటనే కొత్త బోరు వేసి నీటిని అందించినట్లు చెప్పారు. బోరులో నీళ్లు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు



మీ సేవా యజమానులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కార్వేటినగరం: దరఖాస్తుదారుల నుంచి అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ చంద్రమౌళి హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్నెట్, మీసేవా కేంద్రాల యజమానులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. లబ్ధిదారుల నుంచి మీ సేవా కేంద్రాల్లో అధిక రుసుము వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. అలాంటి వాటికి స్వస్తి పలకాలన్నారు. ఇది మళ్లీ పునరావృతం అయితే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

జాబ్ మేళాను వినియోగించుకోండి

గంగాధరనెల్లూరు: జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం ఫరీద్ మస్తాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, రాష్ట్ర సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ సహకారంతో ఈ నెల 14వ తేదీన చిత్తూరు ఎంప్లాయిమెంట్ ఆఫీస్ వద్ద ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎం ఫరీద్ మస్తాన్, నిర్వాహకులు రూపేష్, లోకేష్, కృష్ణయ్య తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులకు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు ఉండాలన్నారు. మిగిలిన వివరాలకు వెలుగు కార్యాలయంలో సంప్రదించాలని వారు కోరారు.

వసతి గృహాల మరమ్మతులకు రూ.1.56 కోట్లు

గంగాధరనెల్లూరు: ప్రభుత్వ హాస్టల్ భవనాలను రిపేర్లు చేయించి విద్యార్థులకు సౌకర్యం కల్పించడానికి రూ.1.56 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఏఎస్‌డబ్ల్యూఓ షకీలా తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని హాస్టల్ భవనాలను రిపేర్ చేయడానికి నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించారని పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.56 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని బాలుర హాస్టల్ భవనానికి రూ.22 లక్షలు, బాలికల హాస్టల్ భవనానికి రూ.21 లక్షలు, తూగుండ్రం హాస్టల్ భవనానికి రూ.20.50 లక్షలు, ఎస్‌ఆర్ పురం మండలం కొత్తపల్లిమిట్ట హాస్టల్ భవనానికి రూ.33 లక్షలు, పెనుమూరు హాస్టల్ భవనానికి రూ.10 లక్షలు, ఉగ్రాణంపల్లి హాస్టల్ భవనానికి రూ.17.50 లక్షలు, పూతలపట్టు హాస్టల్ భవనానికి రూ.16 లక్షలు, పి.కొత్తకోట హాస్టల్ భవనానికి రూ.16 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

ఏఆర్‌టి కేంద్రం తనిఖీ



ఏఆర్‌టి కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న శంకర్

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని లింక్ ఏఆర్‌టి కేంద్రాన్ని బుధవారం డేటా మానిటరింగ్, డాక్యుమెంటేషన్ అధికారి(డిఎండిఓ) శంకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను ఆయన పరిశీలించారు. సెంటర్‌లో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులకు అందుతున్న సేవలను కౌన్సిలర్ బాబును అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షల నిమిత్తం రోజూ ఎంత మంది వస్తున్నారు? సేవలు ఏవిధంగా అందిస్తున్నారు? అనే అంశాలపై ఆరా తీశారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులు మందుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. లింక్ ఏఆర్‌టి కేంద్రంలోనే ఇస్తున్నారని, బాధితులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష, ల్యాబ్ టెక్నీషియన్ జయచంద్ర, సిబ్బంది భువన, సద్దాం పాల్గొన్నారు.

సమయం లేదు.. సాధన చేద్దాం

విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకం. పదో తరగతి పరీక్షల్లో సాధించే మార్కులతోనే విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉంది. గత ఏడాది ఉత్తీర్ణత శాతాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ అప్రమత్తమైంది. ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థులతోపాటు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. ఇక 41 రోజులే వుండడంతో ప్రణాళిక ప్రకారం చదువుకోవాలంటూ విద్యార్థులకు సూచనలు చేస్తున్నారు.

- దగ్గర పడుతున్న పదో తరగతి పరీక్షల సమయం
- విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఉపాధ్యాయులు
- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు



మండలం	విద్యార్థులు
గంగాధరనెల్లూరు	543
కార్వేటినగరం	342
పెనుమూరు	213
శ్రీరంగరాజుపురం	286
వెదురుకుప్పం	223
పాలసముద్రం	163

బలికకంద్రిగ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పాలసముద్రం : జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతి పరీక్షలను మార్చి 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఉన్న సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది. సాధనతో కీలక అంశాలు వెలుగులోకి వస్తాయని ఉపాధ్యాయులు పిల్లలకు సూచిస్తున్నారు. మండలంలో ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 1770 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

పాఠ్యాంశాలపై అవగాహన

ప్రభుత్వం పరీక్షల తేదీలు ప్రకటించడంతో విద్యార్థుల్లో కొంత ఆందోళన మొదలైంది. పరీక్షలకు కేవలం కొన్ని రోజులు మాత్రమే ఉంది. పరీక్షల సమయం దగ్గర పడడంతో ఇప్పటి నుంచి స్పష్టమైన ప్రణాళికతో చదివితే పదో తరగతిలో మంచి మార్కులు సాధించి గట్టెక్కవచ్చు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలంటే పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవడమే ప్రధాన లక్ష్యమని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు

సమయాన్ని వృథా చేయకుండా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక ప్రణాళికతో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన సాగిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు. తరగతిలో వెనుకబడిన వారిని గుర్తించి సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

విద్యార్థులు భయం వీడాలి



పదో తరగతి పరీక్షలంటే విద్యార్థులు భయం వీడాలి. ప్రతి సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలి. పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదువుకుంటే సులభంగా ఉత్తీర్ణత సాధించవచ్చు. ఆంగ్లభాష, గణితంపై సాధన చేస్తే మంచి మార్కులు సాధించవచ్చు. ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సందేహాలను నివృత్తి చేసుకుంటే పదిలో మంచి మార్కులు సాధించి గట్టెక్కడం సులభం.

– రాజేంద్రప్రసాద్, ఎంఈఓ, పాలసముద్రం

ప్రతి సబ్జెక్టుపై సాధన చేస్తున్నా



పదో తరగతిలో వంద మార్కులు సాధించాలన్న లక్ష్యంతో ప్రతి సబ్జెక్టుపై సాధన చేస్తున్నా. మా ఉపాధ్యాయులు సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. పరీక్షలంటే టెన్షన్ ఉన్నా పరీక్షలు బాగా రాయడానికి ప్రణాళికాబద్ధంగా చదువుతున్నా. సమయాన్ని వృథా చేయకుండా సబ్జెక్టుల వారీగా చదువుతున్నాం.

– ఇంద్రజ, పదో తరగతి, బలిజకండ్రిగ హైస్కూల్

ప్రత్యేక తరగతులతో సాధన



హైస్కూల్లో ప్రతి రోజూ ప్రత్యేక తరగతుల్లో సాధన చేస్తున్నాను. ఉపాధ్యాయులు ప్రతి పాఠ్యాంశంపై అవగాహన కల్పిస్తున్నారు. మా సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. దీంతో నాకు చదువుకోవడానికి సులభంగా ఉంది. ఇప్పటికే అన్ని పాఠ్యాంశాలు రివిజన్ చేస్తున్నాను. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం.

– వి.ఢిల్లీబాబు, పదో తరగతి, బలిజకండ్రిగ హైస్కూల్

టెన్షన్ వద్దు



పదో తరగతి పరీక్షలు రాసేటప్పుడు విద్యార్థులు టెన్షన్ లేకుండా ప్రశాంతంగా రాయాలి. ఒత్తిడితో తెలిసిన సమాధానాలు కూడా మరిచిపోయే అవకాశం ఉంటుంది. పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకొని ఆత్మస్థైర్యంతో వందకు వంద మార్కులు సాధించవచ్చు. పరీక్షలు సమీపించే కొద్దీ ప్రత్యేక దృష్టి సారించి విద్యాబోధన చేస్తున్నాం.

– రఘు, ప్రధానోపాధ్యాయుడు, బలిజకండ్రిగ

ఇసుక టిప్పర్లు సీజ్



టిప్పర్లను సీజ్ చేసిన డీఎస్పీ, ఎస్‌ఐ

పాలసముద్రం: వనదుర్గాపురం నుంచి తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం ఉదయం నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప సీజ్ చేశారు. టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వనదుర్గాపురం నుంచి తమిళనాడుకి ఎలాంటి బిల్లులు లేకుండా టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్నారన్న రహస్య ఫిర్యాదుపై డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప నిఘా పెట్టారు. తెల్లవారు జామున 2 గంటలకు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి తీసుకొచ్చారు.